
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 7 ఏప్రిల్ 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.25
సహరీ (సోమ) ఉ.4.30

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	36	29



నమో వేంకటేశాయ

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట

ఆత్రేయపురం, ఏప్రిల్ 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.41.94 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు



మందపల్లి ఆలయంలో భక్తుల రద్దీ

ప్రత్యేక అభిషేకాలు, పూజలు

కొత్తపేట, ఏప్రిల్ 6: మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం శనిత్రయోదశి కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.10,42,505 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.



ఆలయంలో భక్తుల రద్దీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఇంటింటా ప్రచారాలకు

అనుమతి తప్పనిసరి

కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6: రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇంటింటా ప్రచారం కోసం ముందస్తుగా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. సంబంధిత అధికారుల ద్వారా అనుమతులు పొందిన తర్వాత ఆయా ప్రాంతీయ పోలీసుస్టేషన్లకు తెలియచేయాలన్నారు. రాష్ట్రస్థాయి పరిశీలకులు పరిశీలిస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నియమితులైన అధికార యంత్రాంగం పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలన్నారు. సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 1644 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు ఎస్పీ శ్రీధర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, రిటర్నింగ్ అధికారులు ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, ఎ.శ్రీరామచంద్రమూర్తి, జి.కేశవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండే ఎండ

అల్లాడుతున్న జనం

మండపేట, ఏప్రిల్ 6:

ఎండలు మొదలైపోయాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదై మంటెక్కిస్తున్నాయి. ఉదయం పది గంటలు దాటితే రోడ్డు మీదకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. మండే ఎండలకు జనం, మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. విద్యుత్ కోతలు కూడా తోడవ్వడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరోపక్క పలువురు వడదెబ్బలకు గురవుతున్నారు.

ఎండలో ఎక్కువగా తిరుగుతున్న వారికి కడుపులో, చేతుల్లో తెరలు తెరలుగా నొప్పి వస్తుంది. చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు పోవటం వల్ల నొప్పులు కలుగుతాయని గుర్తించాలి. అలాంటి లక్షణాలు కనిపించినపుడు వెంటనే వేడి నీటిలో చిటికెడు ఉప్పు వేసి తాగించాలి. ఎండ దెబ్బ తగిలితే స్పృహతప్పి పడిపోతున్నట్టుగా కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపిస్తుంది. ఆ సమయంలో బాధితులను చల్లటి ప్రదేశంలోకి తీసుకెళ్లి కాళ్లను బాగా రుద్ది ఉప్పు నీరు లేదా ఓఆర్ఎస్‌ను తాగించాలి.

నీరు ఎక్కువ తాగాలి

ఎండలో పనిచేసే ఎవరైనా సరే నల్లని, ముదురు రంగుల దుస్తులు ధరించకూడదు. తెల్లటి దుస్తులు ధరించాలి. పిల్లలు, వృద్ధులు ఇంటికే పరిమితం అవడం మంచిది. నీళ్లను ఎక్కువగా తాగాలి. మద్యం సేవించే వారు జ్వరం, విరోచనాలకు గురవుతారు. వీరు ఎక్కువగా జాగ్రత్తపడాలి. ఎండలో పనిచేసే సమయంలో తలపైనా, మెడపైనా తడి వస్త్రాన్ని వేసుకోవాలి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావటం వల్ల గాలి వేయని ప్రదేశాలలో గుంపులు గుంపులుగా ఉండరాదు.

ఆహార నియమాలు



వేసవి తాపం నుంచి బయట పడేందుకు ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి. ద్రవ పదార్థాలు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి. వీలైనంత వరకు ఎండ దెబ్బ తగలకుండా ఉదయం పది గంటలకే బయట పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవటం మంచిది. వేసవిలో ఎక్కువగా మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి బొండాలు తీసుకోవాలి. ఆయిల్‌తో తయారు చేసిన వంటకాలు పిల్లలకు పెట్టకూడదు. పిల్లలకు ఎక్కువగా పుచ్చకాయ, ఖర్బూజ, దోసకాయ, దానిమ్మ, పండ్లను ఇవ్వాలి.





వడదెబ్బ లక్షణాలు

జాగ్రత్తలు తీసుకోకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. గాలి, వెలుతురు ఉండేలా గదుల్లో చూసుకోవాలి. శరీర ఉష్ణోగ్రతలు క్రమబద్ధంగా ఉంచుకోవాలి. ఉక్కబోత వాతావరణంలో పనిచేసే కార్మికులు చర్మం ఎర్రగా పొడిగా మారిపోతుంది. కాళ్లు చేతులు ఎండలకు చెమట పట్టవు. నాలుక తడారి పోతుంది. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, తల తిరగటం, గుండె దడ, కాళ్లు చేతులు లాగేయటం, వడదెబ్బ లక్షణాలు. జ్వరం 104 వరకు ఉంటుంది. శ్వాస తీసుకోవటం కూడా కష్టంగా ఉంటుంది.

జాగ్రత్తలు..

వడదెబ్బకు గురైన వ్యక్తిని గాలి తగిలే ప్రదేశంలో ఉంచాలి. శరీరంపై ఉండే బిగుతు వస్త్రాలు తొలగించి చల్లటి గాలి తగిలేలా చూడాలి. చల్లటి నీటితో శరీరం తడపాలి. జ్వరం శరీర ఉష్ణోగ్రత తగ్గేలా చూసుకోవాలి. జ్వరం 100 ఫారెన్ హీట్ కంటే తగ్గకుండా చూసుకోవాలి. జ్వరం వేగంగా తగ్గినా ప్రమాదకరమే.. వడదెబ్బకు గురైన వ్యక్తి స్పృహలో ఉంటే పండ్ల రసం, ఓఆర్ఎస్, మజ్జిగ, వంటివి ఇవ్వాలి. ద్రవ పదార్థాలు అందించాలి. వాంతులైనా నీళ్లను మాత్రం తాగటం మానకూడదు.





మాట్లాడుతున్న దూండి రాకేష్

వైసీపీ హయాంలో

ఆర్యవైశ్యులకు అన్యాయం

టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండి రాకేష్

రావులపాలెం, ఏప్రిల్ 6: వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆర్యవైశ్యులకు ఏంచేసిందో చెప్పాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ అధ్యక్షుడు దూండి రాకేష్, కూటమి కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాకేష్, సత్యానందరావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ మాట్లాడారు. కుల రాజకీయాలలో ఆర్యవైశ్యులను బలిచేయవద్దని వైసీపీని హెచ్చరించారు. చంద్రబాబు విచ్చలవిడిగా గంజాయి దొరుకుతుందని ఉదాహరణగా చెప్పిన మాటను కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా వైసీపీ నేతలు తయారయ్యారన్నారు. రావులపాలెంలో దొరికిన గంజాయి ఎక్కడిది, స్టేషన్‌లో నమోదైన 20 గంజాయి కేసులు దేనికి సంకేతమన్నారు. 40 ఏళ్ల చరిత్ర కలిగిన రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్‌ను భ్రష్టు పట్టించారన్నారు. చంద్రబాబు పాలనలో పేద ఆర్యవైశ్యులకు మేలు చేశారన్నారు.



వైసీపీ గూటికి శెట్టిబత్తుల

అమలాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు వైసీపీలో చేరారు. నెల్లూరులో జరిగిన 'మేమంతా సిద్ధం' కార్యక్రమంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజబాబుకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు..

..అయినా ఆగలేదు!

సీఆర్‌జెడ్ పరిధిలో ఆగని మట్టి తవ్వకాలు

గత నెల 27 నుంచి ఇదే తంతు

సమాచారమిస్తే మాత్రం తాత్కాలికంగా నిలుపుదల

తర్వాత యథాతథంగా మట్టి దోపిడీ

మరోసారి అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది



ట్రాక్టర్లను నిలుపుదల చేసిన వీఆర్వో భూలక్ష్మి

కాట్రేనికోన, ఏప్రిల్ 6: సీఆర్‌జెడ్ పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు ఆగడం లేదు. ఈ తవ్వకాల తంతు అందరికీ తెలుస్తుంది గాని స్థానిక రెవెన్యూ సిబ్బందికి తెలియకపోవడం మాత్రం గమనార్హం. గత నెల 27 రాత్రి అక్రమ మట్టి తవ్వకాలపై 'గుట్టు చప్పుడు కాకుండా..శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. ఫలితంగా అధికారులు అరకొర చర్యలతో సరిపెట్టారు. రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి ఎక్సకవేటర్‌ను వదిలేశారు. తిరిగి శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలు ప్రారంభించారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తేవడంతో స్పందించారు. తహసీల్దార్ ప్రశాంతి ఆదేశాలతో వీఆర్వో భూలక్ష్మి సిబ్బందితో వెళ్లి తవ్వకాలు నిలిపివేయించారు. సీఆర్‌జెడ్ పరిధిలో మట్టి తవ్వాలంటే సవాలక్ష నిబంధనలు పాటించాలి. అయితే దర్జాగా మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తుంటే తమకేమీ పట్టనట్టు అధికారులు వ్యవహరించడం వెనుక అసలు రహస్యం ఏమిటో ?? అని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు తెలియకుండా మట్టి తవ్వేస్తున్నారంటే నమ్మశక్యంగా లేదని అన్నారు. నిబంధనల ప్రకారం అక్రమ మట్టి తవ్వకాల్లో ట్రాక్టర్లు, యంత్రాలతో పాటు వ్యక్తులను అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం కేసు నమోదు చేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా మట్టి తవ్వకాలపై కఠినంగా వ్యవహరించి, పోలీసు కేసు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కేంద్ర బలగాల కవాతు

అమలాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్‌స్టేషన్ల పరిధిలో పట్టణ పోలీసులతో కలిపి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి, గడియార స్తంభం సెంటర్, మున్సిపల్ కాలనీ, కుమ్మరికాల్వగట్టు, మార్కెట్ వీధి, గణపతి థియేటర్ రోడ్డు, శుభ కలశం సెంటర్ ప్రాంతాల మీదుగా కేంద్ర బలగాలు ర్యాలీగా కదిలాయి. మున్సిపల్ కాలనీలో స్థానికులతో పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



గరుడ వాహనంపై స్వామివారు

వాడపల్లిలో కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

7లో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో

విస్తృత దాడులు

నాటుసారా, మద్యం స్వాధీనం

నగదు సీజ్ చేశాం

జిల్లా ఎస్పీ శ్రీధర్



ఓటు హక్కుపై స్థానికులతో మాట్లాడుతున్న సీఐ క్రిష్టఫర్

అమలాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో జిల్లాలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ శనివారం తెలిపారు. ఐ.పోలవరం పోలీసుస్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా శుక్రవారం ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి 8 ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లను, 2.66 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. కొత్తపేట సబ్ డివిజన్ పరిధిలోని నగరం పోలీసుస్టేషన్ పరిధిలో ఆరు డ్యూటీఫైడ్ లిక్కర్ బాటిల్స్, 1.08 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. రామచంద్రపురంలో ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అమలాపురం, ఆలమూరు, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు పరిధిలో విస్తృత దాడులు జరిపి ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 67 డ్యూటీఫైడ్ లిక్కర్ బాటిళ్లు, 12.06 లీటర్ల ఐఎంఎల్, 5 ఎన్డీపీ, 2.97 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకుని 8 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. పి.గన్నవరం పోలీసుస్టేషన్ పరిధిలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ విస్తృత తనిఖీల్లో భాగంగా రూ.2.64 లక్షల నగదును సీజ్ చేసి రెండు కేసులు నమోదు చేశామన్నారు. ఆత్రేయపురం పరిధిలో శనివారం విస్తృత దాడులు నిర్వహించి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. చెక్ పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా జొన్నాడ హైవే చెక్‌పోస్టు వద్ద రూ.5 లక్షల నగదును సీజ్ చేసినట్టు ఎస్పీ తెలిపారు.

నేటి నుంచి చింతలూరు జాతర

7లో

'పొన్నాడ'ను అడ్డుకున్న ఎమ్మార్పీఎస్ 7లో

గరుడవాహనంపై
స్వామివారి గ్రామోత్సవం

- ఘనంగా అధ్యయనోత్సవాలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు.వసంత మండపంలో వేద పండితులు చతుర్వేద పారాయణం, ద్రవిడవేద పారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పల్లకిపై స్వామివారు ఆలయ ప్రదక్షణ చేశారు. తిరువీధులలో స్వామివారు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. అనంతరం రాత్రి చంగోలం పారాయణం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అశేషభక్తజనం అధ్యాయనోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఉపకమీషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లు నిర్వహించారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1,61,038

మామిడికుదురు, ఏప్రిల్ 6: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,61,038 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వైనతేయ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. స్వామివారిని 2694 మంది దర్శించుకుని 2017 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి
పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఏప్రిల్ 6: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం లోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,34,080, అన్నదాన విరాళాలు రూ.42,670, కేశఖండన ద్వారా రూ.5,760, తులాభారం రూ.100 వెరసి రూ.2,82,610 ఆదా యం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగ దీష్, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి జీరో

- ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది మేమే
- భూముల చదునులో రూ.400 కోట్లు కొట్టేసిన వైసీపీ
- కూటమి అభ్యర్థులను గెలిపించాలి
- రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి



రాజమహేంద్రిలో బీజేపీ కార్యాలయం ప్రారంభిస్తున్న సిద్ధార్థ్‌నాథ్‌సింగ్, పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 6: రాష్ట్రంతో పాటు రాజమహేంద్రవరం ప్రజలు కూడా పరిపాలనలో మార్పు కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ఐదేళ్ల గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి లేదు. ఏ వర్గానికి సంక్షేమం లేదు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని శనివారం దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు ప్రారంభించి పూజలు చేశారు. పార్టీ కార్యాలయం వద్ద, ఆ తర్వాత ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడారు. రాజమహేంద్రవరం అభివృద్ధి జీరో అని, మోరంపూడి వద్ద ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమే తప్ప ఇక్కడి ప్రజాప్రతినిధులు కాదనే సంగతి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆకాంక్షల మేరకు అభివృద్ధి జరగలేదు అనే భావన రాజమహేంద్రవరం ప్రజల్లో ఉందన్నారు. కేంద్రం భారీగా ఇళ్ల మంజూరు చేసినా ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదన్నారు. జగనన్న కాలనీలు కోసం తక్కువ ధరకే భూసేకరణ చేసి ప్రభుత్వం నుంచి భారీగా డబ్బులు తీసుకోవడం చేశారన్నారు. భూములు చదును చేస్తున్నామని మూడు నుంచి నాలుగు వందల కోట్లు కొట్టేసి ప్రజలను మోసం చేశారు. దౌర్భాగ్యపు రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడానికే బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. రాజమహేంద్రవరం ఇంతకు ముందున్న నాయకులు అలవి కాని వాగ్దానాలు చేశారని, రాజమండ్రి, కాకినాడ ట్విన్ సిటీలు చేస్తామని, పాశ్చాత్య దేశాలుగా చేస్తామని చెప్పిన వారు కనీసం పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని కూటమి పార్టీల అభ్యర్థులను కలుపుకుంటూ ముందుకు వెళుతూ వారి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్ సింగ్, పేరెళ్ల చంద్రశేఖర్ జీ, జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంక దినకర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి ఇతర నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి చింతలూరు నూకాంబికా జాతర



- కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- 8న తీర్థ మహోత్సవం

ఆలమూరు, ఏప్రిల్ 6: గోదావరి జిల్లాలలో పేరుగాంచిన ప్రధా న జాతరలలో ఒకటైన బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూ రు మండలం చింతలూరు నూకాంబికా జాతర ఈనెల 7నుంచి ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న జాతర మహోత్సవం, 8న తీర్థమహోత్సవం, 9న ఉగాది ఉత్సవాలతోపాటు నెల రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కట్టుదట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మద్దూరి శివరామకృష్ణ తెలిపారు. దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. లక్షలాదిమంది భక్తులు తరలిరానున్న ఈజాతరను సమర్థవంతంగా నిర్వహించాలని పలుశాఖల అధికారులతో సమన్వయ కమిటీలను కొత్తపేట ఆర్డీవో జీవివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. చంటిపిల్లల దేవతగా కొలిచే నూకాంబికా అమ్మవారికి జాతర ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు, చెల్లించుకుని వారపోత, తుళ్లిబిళ్ల, కావిడి కోళ్లు, గండాదీపం ఇక్కడ ప్రధానంగా మొక్కులు తీర్చుకుంటారు. సాధారణంగా చంటిపిల్లల్లో వచ్చే ఆటలమ్మ, పొంగు వంటి వ్యాధులు అమ్మవారి ఆగ్రహంవల్ల వస్తాయని అందువలన ఈవ్యాధి సోకిన చంటిపిల్లలచేత ఈ మొక్కులు తీరుస్తుంటారు. ఈవ్యాధులు రానివారు అమ్మ వారి అనుగ్రహం ఉందని మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో పూర్వపు ఉభయగోదావరి జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు చింతలూరు తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తుల కోసం రావులపాలెం, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం డిపోల నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ చెప్పారు.

ఉగాది పురస్కరించుకుని
సత్యదేవుడికి సీఎంఆర్ పట్టువస్త్రాలు అందజేత



సీఎంఆర్ అధినేత సత్యదేవుడికి అందించిన నూతన పట్టువస్త్రాలు

అన్నవరం, ఏప్రిల్ 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈనెల 9న ఉగాది పర్వదినం పురస్కరించుకుని శనివారం విశాఖపట్నం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పట్టువస్త్రాలను అందజేశారు. మూలవరులకు, క్షేత్ర పాలకులు సీతారాములు, వనదుర్గ, కనకదుర్గలు ధరించేందుకు వీటిని సమర్పించారు. దేవస్థానం ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో కృష్ణారావులకు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కంచి మూర్తి, ఇంద్రగంటి సుధీర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఆర్వో మాట్లాడుతూ ప్రతీ ఏటా ఉగాదికి సీఎంఆర్ అధినేత పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం

అంతర్వేది, ఏప్రిల్ 6 : బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మంగళధారణలను వైభవంగా భక్తుల గోవింద నృసింహనామస్మరణతో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి శాంతి కల్యాణం తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

టి.కొత్తపల్లిలో పొన్నాడకు నిరసన సెగ

- పొన్నాడ డౌన్ డౌన్ అంటూ నినాదాలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 6: ముమ్మిడివరం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు టి.కొత్తపల్లిలో చుక్కెదురయ్యింది. శనివారం ఎన్నికల ప్రచారంలో ఆయనకు ఎమ్మార్పీఎస్ నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఎమ్మెల్యే నిబంధనలు ఉల్లంఘించి జగ్జీవన్‌రామ్ విగ్రహం ముసుగు తొలగించి పూలమాల వేయడంపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వద్దని వారించినా దండ వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వేసిన దండను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తొలగించి విగ్రహానికి ముసుగు వేశారు. ఎన్నికల నియమావళి అతిక్రమించారని ఎమ్మార్పీఎస్ ఆరోపించింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పొన్నాడతో వాగ్వివాదానికి దిగడంతో గందరగోళం ఏర్పడింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పొన్నాడ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మాదిగలకు అన్యాయంచేసిన పొన్నాడ అంటూ నినాదాలు చేశారు.



మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు కుమార్తెను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ యాజమాన్యం

కళలు విశ్వజననీయమైనవి

- మాజీ ప్రధాని పీవీ కుమార్తె సురభీ వాణీదేవి
- శ్రీప్రకాష్‌లో ఆకట్టుకున్న హరివిల్లు

పెద్దాపురం, ఏప్రిల్ 6: కళలు విశ్వజననీయమైనవని భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ (తెలంగాణా) సురభీ వాణీదేవీ అన్నారు. స్థానిక రామారావుపేట శ్రీప్రకా ష్ సినర్జీస్ పాఠశాలలో నిర్వహించిన హరివిల్లు కార్యక్రమానికి ఆమె శనివారం హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడారు. కళలు మానవ జీవితానికి సన్నిహిత సంబంధం కలవని సంస్కృతి, ప్రతిబింబానికి ఒక దేశంకానీ, ఒకజాతికానీ ఎంత ఉన్నతమైనదో తెలియజేసేదే కళ అని అన్నారు. కళలచేత మానవ జీవితానికి వికాసం ఉందన్నారు. మనోవికాసానికి ఆనందానికి కళలు మార్గదర్శకాలన్నారు. శ్రీప్రకాష్ పాఠశాల కళలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం గొప్పవిషయమన్నారు. ప్రముఖ డైరెక్టర్ తరుణ్‌భాస్కర్ తల్లి గీతాభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో సైన్సు, ఆర్ట్స్ పట్టాలను పొందేవిధంగా తర్ఫీదు పొందారన్నారు. అలాగే విద్యార్థులు ఎంతో సృజనాత్మకంగా, కళాత్మకంగా తీర్చిదిద్దిన కళాఖండాలు ఎంతో బాగున్నాయని ప్రశంసించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రామగణేష్ మాట్లాడుతూ చిన్నారులకు బాల్యం నుంచే కళల పట్ల మక్కువ పెంచే విధంగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో హరివిల్లు పేరుతో ఇంత గొప్ప కళాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈకార్యక్రమానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిఉన్న వ్యక్తులు ముఖ్యఅతిథులుగా హాజరుకావడం చాలా సంతోషదాయకమన్నారు. దేశంలో అన్నిరాష్ట్రాల సంస్కృతులు, సంప్రదా యాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ హరివిల్లు అనే కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఎల్‌సీ కర్రి పద్మశ్రీ, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత

- 258 క్వింటాళ్ల బియ్యం సీజ్



బియ్యం లోడు వాహనాన్ని పట్టుకున్న ఎస్ఐ రవీంద్రబాబు, ఎంఎస్‌వో మమత

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 6: విశాఖజిల్లా నుంచి అక్రమంగా కాకినాడ పోర్ట్‌కి రవాణా అవుతున్న పీడీ ఎస్ బియ్యం లోడు లారీని తిమ్మాపురం పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా పెద్దిపాలెం నుంచి శ్రీలక్ష్మీ వెంకటేశ్వర లారీ సర్వీసుకు చెందిన లారీలో పీడీఎస్‌కు చెందిన బియ్యం లోడు అక్రమంగా రవాణా అవుతుందని 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పీడీఎస్ బియ్యం లోడు లారీని శుక్రవారం తెల్లవారుజామున 1.50 గంటలకు పండూరు జంక్షన్‌వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా లోడు లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపా రు. ఈ బియ్యం లోడు లారీ విశాఖజిల్లా పెద్దిపాలెం నుంచి వరంగల్ జిల్లాకు వెళుతున్నట్లు రసీదులో ఉందన్నా రు. కానీ లోడు లారీ కాకినాడ పోర్టుకి సరు కు రవాణా అవుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అదుపులోకి తీసుకున్న బి య్యం లోడు లారీని జిల్లా పౌరసరఫరాల శాఖ గోదాములకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు. సీజ్‌చేసిన లారీలో 520 బియ్యం బస్తాల్లో 258.18 క్వింటాళ్ల సరుకు ఉన్నట్లు మండల సివిల్ సప్లయిస్ అధికారిణి మమత తెలిపారు. వీటిని ఎంఎల్ఎస్ పాయింట్‌కి అప్పగించారన్నారు. సేకరించిన శాంపుల్స్‌ని పరీక్షకోసం జిల్లా మేనేజర్ ద్వారా పంపించి నిర్ధారణ చేస్తామ ని, నిందితులపై 6ఏ కేసు నమోదుకు సిఫార్స్ చేస్తామన్నారు.

చెట్లు నరికిన వైసీపీ మండలాధ్యక్షుడిపై కేసు

గోకవరం, ఏప్రిల్ 6: వైసీపీ గోకవరం మండలాధ్యక్షుడు పాటి రాంబాబుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన వైసీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు అదే గ్రామంలోని సుందరమ్మ సత్రం భూములను లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో లీజుకు సాగు చేస్తున్న పొలంలో కొన్ని జీడిమామిడి చెట్లను అక్రమంగా నరికి బయటకు తరలించినట్టు ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో రాంబాబుపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్ఐ నాగరాజు తెలిపారు.

వైసీపీ ప్రచారంలో భవిత కేంద్రం ఆయా

- ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తున్న అధికార పక్షం

సీతానగరం, ఏప్రిల్ 6: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన భర్తను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న రాజానగరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జక్కంపూడి రాజా సతీమణి జక్కంపూడి రాజశ్రీతో కలసి సీతానగరం భవిత కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న రాజేశ్వరి అనే మహిళ నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంఘటన పలు విమర్శలకు తావిస్తోంది. తరచూ ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతున్న వైసీపీ చర్యల్లో ఇదొక మచ్చుతునక. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా అధికార పార్టీ నాయకులు మాత్రం తమ దారి తమదే అన్నట్టు ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంగిస్తూనే ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వ జీతం తీసుకుంటూ మరోవైపు ఒక రాజకీయ పార్టీ తరుపున నేరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటున్నా ఉద్యోగుల్లో మార్పులు రావడం లేదు. ఇటువంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే రాజా సతీమణి రాజశ్రీతో ఎన్నికల ప్రచారంలో భవిత కేంద్రం ఆయా

కాకినాడ జిల్లా స్వీప్
అంబాసిడర్‌గా యశస్వి



యశస్విని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 6: ఓటుహక్కు వినియోగంపై యువతలో చైతన్యాన్ని తీసుకువచ్చే లక్ష్యంతో ప్రముఖ సినీగాయకుడు జీ-సరిగమప కార్యక్రమ విజేత యశస్వి కొండేపూడిని కాకినాడ జిల్లా స్వీప్ ప్రోగ్రాం అంబాసిడర్‌గా నియమించినట్లు జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వంగా కలిశారు. లోక్‌సభ, శాసనసభ సాధారణ ఎన్నికలు 2024 కు సంబంధించి ఓటర్లలో చైతన్యం అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లాలో స్విప్ కార్యక్రమాలు వినూత్నంగా చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- తెలంగాణవాసి దుర్మరణం, ఇద్దరికీ గాయాలు



మృతి చెందిన పట్టెం రాజు

ఎటపాక, ఏప్రిల్ 6: అల్లూరి జిల్లా ఎట పాక మండలం నెల్లిపాక, చోడవరం గ్రామాల మధ్యలో జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్న ఘటనలో తెలంగాణ వాసీ దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన పెట్టెం రాజు (30) ఓ పని నిమిత్తం నెల్లిపాకకు వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై భద్రాచలం వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో భద్రాచలం ఆసుపత్రికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామైన నెల్లిపాకకు గ్రామ వలంటీర్ మడివి కమల ఆమె కొడుకు చందు వస్తున్నారు. ఈనేపథ్యంలో నెల్లిపాక- చోడవరం గ్రామాల మధ్యలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టు సమీపంలో ఈరెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో తలకు, ఛాతిభాగంలో తీవ్ర గాయాలైన పెట్టెం రాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వలంటీర్ కొడుకు చందుకి తీవ్ర గాయాలయ్యాయి. కమలకు స్వల్ప గాయాలతో బయట పడింది. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

అంబాజీపేట, ఏప్రిల్ 6: కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు పరిధిలోని గొల్లగుంట గ్రామానికి చెందిన కడలి వెంకటరమణ(50) తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ కె.చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లగుంటకు చెందిన వెంకటరమణ 15 ఏళ్ల క్రితం భార్య, పిల్లలు వదలి వెళ్లడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున అతని ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ మేరకు అతని సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈజీమనీ కోసం బైక్‌ల చోరీ

- పోలీసులకు చిక్కిన నలుగురు సభ్యుల ముఠా
- 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు



బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ముఠా సభ్యులను పట్టుకున్న పట్టణ పోలీసులు

మండపేట, ఏప్రిల్ 6: జల్సాలకు అలవాటుపడి చేడు వ్యసనాలకు బానిసలై ఈజీమణి కోసం దొంగతనాలను వృత్తిగా ఎంచుకుని బైక్‌ల చోరీకి పాల్పడున్న ముఠా సభ్యులను పట్టుకుని పట్టణ పోలీసులు గుట్టు రట్టుచేశారు. మండపేట పట్టణ ఎస్.ఐ హరికోటి శాస్త్రి తెలిపిన వివ రాల ప్రకారం పట్టణంతోపాటు ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బైక్‌లు చోరీకి పాల్పడే ముఠా సభ్యులను శనివారం అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈనెల 4న మండపేటకు చెందిన వ్యక్తి బైక్ చోరీకి గురైంది. బైక్‌ను పోగొట్టుకున్న బాధితుడు పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. బైక్ చోరీలు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట సీ.ఐ అఖిల్‌జమా, పట్టణ ఎస్.ఐ హరికోటిశాస్త్రి, ఇద్దరు కానిస్టేబుల్స్‌తో బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈనేపథ్యంలో శనివారం పట్టణంలో సంఘం కాలనీ రోడ్డు సమీ పంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా ఈజీమణి కోసం అలవాటుపడి, చేడు వ్యవసనాలకు లోనై బైక్‌లను చోరీకి పాల్పడుతున్నట్టు విచారణలో అంగికరించటంతో పాటు చోరీలకు పాల్పడిన బైక్‌ల వివరాలను పోలీసుల రాబట్టారు. చోరీకి పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులు పథకం ప్రకారం చోరీలకు పాల్పడుతుంటారని పోలీసులు చెప్పారు. గోకవరం మండలం మొల్లేటి మల్లవరంనకు చెందిన ముచ్చకర్ల ప్రసాద్, బురుకట్ట కటాస్వా ములు, మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన మొక్క అప్పారావులను అదుపులోకి తీసు కుని ఆరెస్టు చేశామన్నారు. నిందితులు ఉమ్మడి జిల్లాలోని మెట్టప్రాంతాలైన జగ్గంపేట, ఏలేశ్వరం, పెద్దాపురం, మండపేట పట్టణంతోపాటు, విశాఖలో రెండుచోట్ల చోరీలకు పాల్పడినట్టు ముఠా సభ్యులు అంగీకరించరని ఎస్.ఐ తెలిపారు. వారివద్ద నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.5లక్షలు వరకు ఉంటుందని ఎస్.ఐ తెలిపారు. చోరీలు చేసిన బైక్‌లను మండపేట పట్టణంలోని గొల్లపుంత టిడ్కో గృహాల వద్ద దాచి ఉంచారని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని ఆలమూరు కోర్టులో హాజరుపర్చగా ఈనెల 12వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకున్న రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, సీఐ అఖిల్‌జమా. ఎస్ఐ హరికోటిశాస్త్రి, కానిస్టేబుల్స్ సతీష్, రమేష్‌లను జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

ఉండ్రాజవరంలో ఇద్దరు దొంగలు అరెస్టు

- 17 మోటారు సైకిళ్ల స్వాధీనం



ఇద్దరు బైక్ దొంగలను పట్టుకున్న పోలీసులు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 6: మోటారుసైకిళ్ల దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఉండ్రాజవరం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిడదవోలుకు చెందిన బొద్దూరి సతీష్, సమిశ్రగూడేనికి చెందిన తాతోలు రామకృష్ణ 17 మోటారుసైకిళ్ల దొంగతనం చేసినట్టు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.8.50లక్షలు ఉంటుందని చెప్పారు. ఉండ్రాజవరం పోలీసుస్టేషన్ పరిధిలో 2 కేసులు, తణుకులో 2, రాజమహేంద్రవరంలో 4, కొవ్వూరులో 3, పాలకొల్లు, ఏలూరు, గణపవరం, భీమవరం, నిడదవోలు, వీరవాసరం స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదైనట్లు ఆయన వివరించారు. మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపర్చినట్టు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ముమ్మిడివరంలో జనసేన ఆత్మీయ సమావేశం

కాట్రేనికోన, ఏప్రిల్ 6: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం ముమ్మిడివరం శ్రీకృష్ణదేవ రాయ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతుందని జనసేన మండల అధ్యక్షుడు మోకా బాలప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథులుగా అమలాపురం పార్లమెంటు, అమలాపురం, ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థులు గంటి హరీష్‌మాధుర్, అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు పాల్గొంటారని తెలిపారు.

రైల్వే ఎలైన్‌మెంట్ మార్చాలని గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మలికిపురం, ఏప్రిల్ 6: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌ను మేడిచర్లపాలెంలో ఇళ్ల మీదుగా వేయవద్దని గ్రామస్తులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. దీనిలో భాగంగా గ్రామంలోని రాపాకవారిపేట నుంచి బాధిత కుటుంబాలు గ్రామపంచాయతీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చి పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌ను అనుసంధానిస్తూ దిండి-చించినాడ వద్ద రైల్వేలైన్ వంతెన నిర్మాణం జరుగుతుంది. రైల్వే వంతెన నుంచి గుడిమెళ్లంక గ్రామం మీదుగా రైల్వే లైన్ వెళ్లే విధంగా ఎలైన్‌మెంట్ రూపొందించారు. ఈఎలైన్‌మెంట్‌ను వ్యతిరేకిస్తూ కొంత మందిప పెద్దలు అధికారులను ప్రభావితంచేసి మార్పించారు. గుడిమెళ్లంకలోనే మంచినీటి చెరువుమీదుగా వేరే ఎలైన్‌మెంట్‌తో రూపొందించి ఫ్లగ్ మార్కింగ్ చేసే ప్రక్రియ చేపట్టినప్పుడు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేయడంతో అది కూడా నిలిపివేసి మేడిచర్లపాలెంలోని రాపాకవారిపేట ఎలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఈమార్గంలో ఉన్న ఎస్సీ పేటలో పలువురు ఇళ్లు కోల్పోతున్నామని, తమ ఇళ్ల మీదుగా ఎలైన్‌మెంట్ చేయడానికి వీలు లేదని జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దానిపై స్పందించిన ఆయన ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. అయినప్పటికీ రెండు రోజుల క్రితం రైల్వే లైన్‌కు సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో ఎలైన్‌మెంట్ పరిశీలనకు వచ్చారు. దీంతో బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతూ దేవ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరికు వినతిపత్రం సమర్పించారు. 40మంది గృహాలు కోల్పోవలసి వస్తుందని, ఇల్లులేని వరిచేలు మీదుగా ఎలైన్‌మెంట్ రూపొందించాలని కోరారు.

పుదుచ్చేరి ఎన్డీయే అభ్యర్థితో మల్లాడి వర్గం సమావేశం

యానాం, ఏప్రిల్ 6: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్డీయే కూటమి అభ్యర్థి, హోంమంత్రి నమశ్శివాయ శనివారం యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ 30మంది సభ్యులతో సమావేశమయ్యారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యే ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో సీఎం ఎన్.రంగస్వామి, రాజ్యసభ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు సెల్వగణపతి, ఎన్డీఏ అభ్యర్థి మంత్రి నమశ్శివాయ, ప్రజాపనులశాఖ మంత్రి లక్ష్మీనారాయణ సమావేశమై యానాం అభివృద్ధి చేపట్టాల్సిన పనులపై, పెండింగ్ సమస్యలపై తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. యానాం అభివృద్ధికి సహకారిస్తానని నమశ్శివాయ అన్నారు. ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, గిడ్ల చంద్రరావు, పెండెం సూర్యప్రకాష్, గూటం శివగణేష్, తిరుకోటి నాగేశ్వరరావు, కాదా వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.


మల్లాడిని సత్కరిస్తున్న ఎన్డీయే అభ్యర్థి నమశ్శివాయ

ఘనంగా పెద్దింట్లమ్మ తీర్థ మహోత్సవాలు

అంతర్వేది, ఏప్రిల్ 6: కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం (చిన్నకొల్లేరు)లో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి తీర్థ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారంతో ఉత్సవాలు ముగియనుండడంతో అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి ఆనుకుని ఉన్న కొబ్బరి తోటల్లో భోజనాలు చేశారు. గ్రామ ఆడపడుచులంతా అమ్మవారికి ప్రత్యేకంగా పసుపు, కుంకుమ పూజలు నిర్వహించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 6: ఇఫ్తార్ విందులు పరమత సహనానికి ప్రతీకలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావు అన్నారు. మండపేట జామాతే మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ మాజీచైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడుఉంగరాల రాంబాబు, ముస్లింలు అల్తాప్, ఖరీం పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఎప్పుడిస్తారో?

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 6: గౌరవ వేతనం కోసం ఎంపీటీసీలు ఎదురుచూస్తున్నారు. గొల్లవిల్లి ఎంపీటీసీ దోనిపాటి బాలమ్మ శనివారం గౌరవవేతనంపై ఎంపీడీవో కొరారి వెంకటేశ్వరప్రసాద్‌ను వివరణ కోరింది. గత ఏడాది సెప్టెంబరు వరకు సభ్యులకు గౌరవ వేతనం చెల్లించినట్టు ఆయన తెలిపారు. ఇంకా ఆరు నెలల బకాయి ఉందన్నారు. నిధులు విడుదల కావాల్సి ఉందని చెప్పారు.

అసౌకర్యాల నడుమ ప్రత్యేక వైద్య శిబిరం

మామిడికుదురు, ఏప్రిల్ 6: అప్పనపల్లిలో శనివారం జరిగిన జగనన్న ప్రత్యేక వైద్య శిబిరం అసౌకర్యాల నడుమ జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలోని వైద్యులు పంచాయతీ గదుల్లోనే వైద్యసేవలందించారు. ఒక పక్క సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా మరో పక్క ఈ వైద్య శిబిరం నిర్వహించడం గమనార్హం. శిబిరం కోసం స్థానిక హైస్కూలు ఇవ్వడానికి తిరస్కరించడంతో ఇరుకుగా ఉన్న పంచాయతీ కార్యాలయంలోనే శిబిరాన్ని నిర్వహించి మమా అనిపించారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

యానాం, ఏప్రిల్ 6: ఈనెల19న జరగనున్న పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికకు యానాం నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శనివారంతో ముగిసిందని యానాం అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఆర్.మునిస్వామి తెలిపారు. ఈనెల రెండో తేదీ నుంచి యానాం నియోజకవర్గంలో ఐదు సెక్టార్లుగా పోస్టులో ఓటింగ్ ప్రక్రియ నిర్వహించామన్నారు. ఈనెల19న జరిగే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- కూటమి అభ్యర్థులు అయితాబత్తుల ఆనందరావు, గంటి హరీష్‌మాధుర్
- పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక


అమలాపురం: వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 6: చంద్రబాబు పాలనలో మాత్రమే రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని అమలాపురం అసెంబ్లీ, పార్లమెంట్ కూటమి అభ్యర్థులు అయితాబత్తుల ఆనందరావు, గంటి హరీష్‌మాధుర్ అన్నారు. శనివారం భీమనపల్లి, నంగవరం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన గ్రామ కమిటీల అధ్యక్షుడు మంచెం బుజ్జి, గుర్లింక చిన్నా ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. పలు ప్రాంతాల్లో మహిళలు అభ్యర్థులకు హారతి ఇచ్చి ఆశీర్వదించారు. దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మానే నరసింహమూర్తి, సలాది నాగుతో పాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పార్టీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, నియోజకవర్గ బీసీ సెల్ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు దేశంశెట్టి నాగరత్నకుమారి, చిక్కం పెదబాబు, నిమ్మకాయల పద్మావతి, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, ఆకేటి పెద్ద, ఉలిశెట్టి దొరబాబు, సలాది శ్రీనివాసరావు, చిక్కం కాసు, రవణం మధు, జనసేన నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, గుత్తాల సుభాష్‌చంద్రరావు, చిక్కం సుధ, ఆకుల బుజ్జి, చిక్కం భీముడు, ఆకేటి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు గనిశెట్టి అరవింద్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


మండపేట: వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

మండపేట, ఏప్రిల్ 6: రాష్ట్రంలో రాక్షస పాలనను భరించలేక వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. జగన్‌ను గద్దె దించడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. పాలతోడుకు చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి వేగుళ్ల ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మండపల్లి గంగాధర్, ఆకాష్, తాతపూడి యోహాన్, మండపల్లి మదుసూధనరావు తదితరులు వున్నారు. కార్యక్రమంలో పిల్లా తాతీలు, మండపల్లి శ్రీనుబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, కపిలేశ్వరపురం సర్పంచ్ శాఖ శ్రీను తదితరులు వున్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి

కొత్తపేట, ఏప్రిల్ 6: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని అమలాపురం పార్లమెంట్ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. గంటి-పల్లిపాలెంలో శనివారం ప్రజాగళం ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఆరోపించారు. నేషనల్ హైవేకు సమీపంలో ఉన్న గంటి పల్లిపాలెం గ్రామాలను హైవేకు అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేస్తామన్నారు. తమను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు ఆకుల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాసరావు, చీకరమిల్లి లవరాజు, పిల్లి రాజశేఖర్, ముదునూరి లింగరాజు, పల్లపు రాజు, గుత్తుల రాంబాబు, సుంకర పండు, పత్తి రాము, గుత్తుల శ్రీనివాస్, రాయి శివాజీ, నక్కా శ్రీనివాస్, జి.సత్తిబాబు, కొండేపూడి శ్రీను పాల్గొన్నారు.

బ్రాహ్మణుల కార్పొరేషన్ ఏర్పాటు ఘనత టీడీపీదే


అమలాపురం: మాట్లాడుతున్న ఎన్డీయే అభ్యర్థి ఆనందరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6: రాష్ట్రంలో బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం తొలిసారిగా కార్పొరేషన్ ఏర్పాటుచేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఎందరికో ఆర్థిక సాయం అందించారన్నారు. టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య అధ్యక్షతన జరిగింది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని బ్రాహ్మణులకు ఆనందరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొంపెల్ల కృష్ణకుమారి, ఆకెళ్ల నారాయణమూర్తి, బళ్లమూడి దివాకరశాస్త్రి, మండలీక సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల సుబ్రహ్మణ్యం, బులుసు వెంకటసుబ్రహ్మణ్యశర్మ, నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, దెందుకూరి సత్తిబాబురాజు, బొర్రా ఈశ్వరరావు, అధికారి బాబ్జి, పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

జనసేనలో చేరిన కుందాలపల్లి సర్పంచ్


కాట్రేనికోన: టీడీపీలో చేరిన వారితో దాట్ల బుచ్చిబాబు

పి.గన్నవరం, ఏప్రిల్ 6: గ్రామభివృద్ధి కోసం అప్పట్లో జనసేనను వీడిన కుందాలపల్లి సర్పంచ్ పప్పుల శ్రీనివాసరావు శనివారం వార్డు సభ్యులతో కలిసి కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ సమక్షంలో తిరిగి సొంతపార్టీ జనసేనలో చేరారు. కుందాలపల్లి, నరేంద్రపురం,రాజులపాలెం గ్రామాల్లో గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాద్‌బాబులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, మట్టపర్తి రామకృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సూధాబాబ్జి, వాసంశెట్టి చినబాబు, వరలక్ష్మి, పప్పుల సాయిబాబు, నేలపూడి దామోదరం, నక్కా సునీల్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, కె.సత్య నారాయణరాజు, పేరిచర్ల నాగరాజు, నక్కా సత్యనారాయణ, శేరు శ్రీను బాబు, కేదాశి చిన్న, విత్తనాల ఆదినారాయణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక


పి.గన్నవరం: కుందాలపల్లిలో గిడ్డి సత్యనారాయణ సమక్షంలో జనసేనలో చేరిన సర్పంచ్ శ్రీనివాసరావు

కాట్రేనికోన, ఏప్రిల్ 6: గెద్దనపల్లి పంచాయతీ బక్కివారిపేటకు చెందిన 50మంది వైసీపీ కార్యకర్తలు శనివారం మురమళ్ల టీడీపీ క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. చేరిన వారిలో ఎలిపే వెంకటేశ్వరరావు, పోతుమూడి ఏడుకొండలు, వజ్రపు నాగేశ్వరరావు, యాళ్ళ ప్రసాద్, బళ్ళ బాలకృష్ణ, మాదే లోవరాజు, మోర్త వెంకటేశ్వరరావు, రాగుర్తి చినశ్రీనివాసరావు, పెదపాటి శివ తదితరులున్నారు.

నియోజకవర్గాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతా

రాజోలు, ఏప్రిల్ 6: ప్రజలు సహకారం అందిస్తే రాజోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిడిపిస్తానని ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. మెరకపాలెం, కాట్రేనిపాడు, శివకోడులో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా గాజు గ్లాసుపై, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండలాల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, తెలుగు యువత, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

నేడు జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6: అమలాపురంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం, కోనసీమ కవితోత్సవం నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ నిర్వహణలో కవి సమ్మేళనం జరుగుతుంది. శ్రీశ్రీకళావేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే కవితోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి 143మంది కవులు సమ్మేళనంలో పాల్గొంటారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బోయి భీమన్న సాహిత్యనిధి ట్రస్టు చైర్‌పర్సన్ బోయి హైమావతి, పలువురు ప్రముఖులు పాల్గొంటారు. కవితోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం రామకృష్ణారావు, అరిగెల బలరామమూర్తి, పోలిశెట్టి అనంతలక్ష్మిదేవి కోరారు.

పొలాలకు సాగునీరు అందిస్తాం: డీఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కె.గంగవరం, ఏప్రిల్ 6: ఈనెల20 వరకూ సాగునీరివ్వండి మహాప్రభో అని యండగండి, పామర్రు, అముజూరు గ్రామాల రైతుల ఆందోళనను శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించమైంది. దీనిపై కోటిపల్లి ఇరిగేషన్ డీఈ జి.హిమరత్నం స్పందించారు. పామర్రులోని ఈనిక దశలో ఉన్న పంట పొలాలను ఆమె పరిశీలించారు. రైతులు సాగునీటి సమస్య గురించి వివరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతీ పొలానికి అవసర మైన సాగునీరిందిస్తామని డీఈ భరోసా ఇచ్చారు. ఇరిగేషన్ ఏఈ కె.సుబ్బారావు, మండల వ్యవ సాయశాఖ అధికారి బలుసు రవి, వీఏఏ గణేష్, రైతులు పాల్గొన్నారు

మేలిమి బంగారంతో తపాలా బిళ్ల



అమలాపురం టౌన్, ఏప్రిల్ 6: ఖతర్ రాజు తమిమ్‌బిన్ హమద్‌అల్‌థానీ సింహాసనాన్ని అధిష్ఠించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా రాజు ముఖ చిత్రంతో 200 రియల్స్ ముఖ విలువ గల బంగారు తపాలా బిళ్లను ముద్రించింది. కేవలం వెయ్యి మాత్రమే ముద్రించిన ఈ తపాలా బిళ్లలు ఒక్కొక్కటి గ్రాము బరువుతో మేలిమి బంగారంతో తయారు చేశారు. అందమైన బాక్సులో తపాలా బిళ్లను ఉంచారు. అరుదైన తపాలా బిళ్లను అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన తపాలా బిళ్లల సేకరణ కర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ఖతర్ దేశంలో ఉంటున్న మిత్రుడు చలంచర్ల కాశీవిశ్వనాథ్ ద్వారా రప్పించారు. ఈ తపాలా బిళ్లను ప్రత్యేక టెక్నాలజీతో నెదర్లాండ్స్ దేశంలో ముద్రించినట్టు కామేశ్వర్ తెలిపారు.

మత్స్యకార కుటుంబాన్ని ఆదుకోవాలి

అల్లవరం, ఏప్రిల్ 6: గోడితిప్పకు చెందిన మత్స్యకారుడు పంతాడి శ్రీనివాస్ మార్చి 30న చేపల వేటకు వెళ్లి మృతి చెందినందున పేదరికంలో ఉన్న అతని కుటుంబాన్ని ప్రభుత్వ అధికారులు ఆదుకోవాలని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకట రామరాజు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్, మత్స్యశాఖ ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

మన బాధ్యత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 3: మనబాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సెంటినరీ చర్చిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. సంజీవని బ్లడ్‌బ్యాంకు సిబ్బంది రక్తం సేకరించారు. సెంటినరీ చర్చి కాపరి ఎం.రాజ్‌కుమార్, అధ్యక్షుడు సీహెచ్.మోజెస్ విక్సన్, కార్యదర్శి జుత్తుక అనిల్‌కుమార్, కోశాధికారి వి.శ్యామ్యూల్, మన బాధ్యత ఫౌండేషన్ గారా అజయ్‌కుమార్, సభ్యులు పోలినాటి కిరణ్‌బాబు సంజీవని బ్లడ్‌బ్యాంకు మేనేజరు ప్రకాష్, రాజ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

జు-జిట్సు పోటీల్లో పవర్‌కిక్ విద్యార్థుల ప్రతిభ



అమలాపురంటౌన్, ఏప్రిల్6: ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన జాతీయ స్థాయి జు-జిట్సు చాంపియన్ షిప్-2024 పోటీల్లో అమలాపురం పవర్‌కిక్ కరాటే విద్యార్థులు ప్రతిభ చాటినట్టు చీఫ్‌కోచ్ పడాల అంజి తెలిపారు. జు-జిట్సు ఫైటింగ్ సిస్టమ్‌లో బొలిశెట్టి యశస్విని స్వర్ణ పతకాన్ని సాధించగా అండర్-14లో అడపా రవిశంకరి తృతీయస్థానం, అండర్-16లో చెల్లుబోయిన వినీషాసుసత్య, గుత్తుల అశ్విత, పోతంశెట్టి సాయిసంపత్‌లు తృతీయస్థానాలు సాధించారు. ఈపోటీలకు రిఫరీలుగా అల్లాడ రవి వ్యవహరించారు.

యశస్వినికి స్వర్ణ పతకం: సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో 8వ తరగతి చదువుతున్న బొలిశెట్టి యశస్విని జు-జిట్సు నేషనల్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించినట్టు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నాలుగు రోజులు నిర్వహించిన పోటీల్లో అండర్-16 విభాగంలో 52 కిలోల ఫైటింగ్ సిస్టమ్‌లో యశస్విని స్వర్ణ పతకాన్ని సాధించిందని చెప్పారు. త్వరలో జరిగే అంతర్జాతీయ పోటీలకు శిక్షణ అందించనున్నట్టు అంజి తెలిపారు.

14న కోనసీమ జిల్లా అరసం మహాసభ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జిల్లాశాఖ ప్రథమ మహాసభ ఈనెల14న బండారులంక బీవీఎస్ఎన్ షాపింగ్‌మాల్‌పై అంతస్తులోని ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, ప్రముఖ రచయిత గండి స్వామిప్రసాద్ తెలిపారు. మహాసభకు జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జునసాగర్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈసందర్భంగా అరసం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని సాహితీ ప్రియులు, భాషాభిమానులు, కవులు, రచయితలు హాజరు కావాలని స్వామిప్రసాద్ కోరారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: బహుముఖం
వెంకటరమణ	: భరతనాట్యం
శ్రీలలిత	: గో ఎట్ లైఫ్
శేఖర్ స్క్రీన్-1	: మంజుమ్మల్‌బాయ్స్
శేఖర్ స్క్రీన్-2	: ఓంభీమ్‌బుష్
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: భీమా
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఫ్యామిలీ స్టార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

రూ.8లక్షలు విలువైన వైద్య పరికరాలు అందజేత



మండపేట, ఏప్రిల్ 6: మండపేట ప్రభుత్వాసుపత్రికి ఓఎన్జీసీ సంస్థ సమకూర్చిన రూ.8లక్షలు విలువైన డబుల్ సర్‌ఫేస్ ఫొటో థెరపిరెడియంట్ యూ నిట్, హెమటాలజీ ఎన్‌లైజర్, డెంటల్ ఎక్సెరేలను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతుదాస్, సీజీఎం రేపల్లె రామారావు అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.రాధాకుమారి, వైద్యులు సతీష్, భావన, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. సంస్థ ప్రతినిధులను వైద్యులు అభినందించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

రాయవరం, ఏప్రిల్ 6: లొల్లలో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ నేత చాత్రాతి జానకి రాంబాబు నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో రాంబాబు మాట్లాడారు. మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. వాజ్‌పేయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎస్.రామకృష్ణారెడ్డి, సి.సుబ్బారావు, సి.తమ్మిరెడ్డి, ఆర్.శ్రీనివాస్, సాయిరాం ప్రసాద్ పి.సురేష్, జి.సతీష్, ఎ.శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఏ.సుధాకర్ స్వగృహం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పాల్గొని బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించారు. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు, లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటిపల్లి సుబ్రహ్మణ్యం, బీజేపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఈవీఎంల కోసం స్ట్రాంగ్‌రూమ్స్ గుర్తింపు

పి.గన్నవరం,ఏప్రిల్6: స్ట్రాంగ్ రూమ్స్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. ఈవీఎంలు భద్రపరచడానికి ముంగండ హైస్కూల్లో స్ట్రాంగ్‌రూమ్స్‌ను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎంలను గ్రౌండ్‌ఫ్లోర్‌లో నాలుగు రూమ్స్, పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను మొదటి ఫ్లోర్‌లో నాలుగు రూమ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఆర్‌వో వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్‌కె హసాస్సెన్, డిప్యూటి తహశీల్దార్ డి.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో అమలాపురం పార్లమెంటు జిల్లా పార్టీ కార్యాలయం వద్ద జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. బీజేపీ ఆవిర్భావం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన తీరును ఆయన వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ, దూరి రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, చీకురుమిల్లి శ్రీనివాసరావు, పట్టణ, మండలశాఖల అధ్యక్షులు వెంపరాల భాస్కరశాస్త్రి, రెడ్డినాయుడు, నల్లా సత్తిబాబు, సుంకర సాయి, కొండేటి ఈశ్వర్‌గౌడ్, బొంతు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

అంతర్వేది, ఏప్రిల్ 6: సఖినేటిపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికలకోడ్ ఉన్న నేపథ్యంలో సమీక్షలు నిర్వహించకుండా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో మాట్లాడి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీవీ సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జైభీమ్ భారత్ అభ్యర్థిగా విజయ్‌చంద్ర

పి.గన్నవరం, ఏప్రిల్6: జైభీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా దుక్కుపాటి విజయ్‌చంద్రను నియమించినట్టు వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ పార్టీ కార్యాలయంలో బీ ఫారం అందుకున్నారు.

అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగించాల్సిందే

ఆలమూరు, ఏప్రిల్ 6: ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతులు లేని ఫ్లెక్సీలను తక్షణం తొలగించాలని డీఎల్‌పీవో ఎస్‌టీవీ రాజేశ్వరరావు అధికారులకు సూచించారు. ఆలమూరులో శనివారం వివిధ శాఖల అధికారులతో డీఎల్‌పీవో రాజేశ్వరరావు, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో మేరీరోజ్‌ల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు ఉన్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని తొలగించాలన్నారు. ఎన్నికల నియమావళి విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని సేవలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ

ద్రాక్షారామ, ఏప్రిల్ 6: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి సందర్శించారు. శాంతకుమారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంది మండపంలో ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో పి.టి.వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

విధుల నుంచి వలంటీరు తొలగింపు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 6: గోపవరం సచివాలయానికి చెందిన గ్రామ వలంటీర్ కాకర దుర్గాప్రసాద్‌ను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో కొరారి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. గోపవరంలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కారణంగా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు వలంటీర్‌ను వెబ్‌పోర్టల్ నుంచి తొలగించి, సిమ్‌కార్డు, బయోమెట్రిక్ డివైస్ స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

కూటమిదే విజయం

మలికిపురం, ఏప్రిల్ 6: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని టీడీపీ మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షులు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని అన్నారు. గ్రామాల్లో అభ్యర్థులు పర్యటిస్తుంటే ప్రజల నుంచి మంచి మద్దతు వస్తుందన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, కూటమి పాలన కోసం ఎదురు చూస్తున్నారని వారు తెలిపారు.

వలస వచ్చిన వారికి సీటు ఇవ్వడం అన్యాయం

ముమ్మిడివరం, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని సేవలు అందించిన వారికి టిక్కెట్ ఇవ్వకుండా వలస వచ్చిన వారికి టిక్కెట్ కేటాయించడం తీవ్ర అన్యాయమని, దీనివల్ల పార్టీ నష్టపోతుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కరవర్మ, రెడ్డి త్రిమూర్తులు, యల్లమిల్లి ధనరాజు, డి.వెంకటేష్, కడియాల సత్యనారాయణలు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

అల్లవరం, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల నియామవళిని ఖచ్చితంగా పాటించాలని అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించవద్దని అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు. సెక్షన్-30, 144 అమలులో ఉన్నందున ఎన్నికల ప్రచార సభలు, సమావేశాల నిర్వహణకు ముందుస్తు అనుమతి పొందాలన్నారు. ఊరేగింపు నిర్వహించవద్దని రాజకీయ కార్యక్రమాల్లో డీజే సౌండ్ సిస్టమ్ ఉపయోగిస్తే వాటిని స్వాధీనం చేసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

18మంది వలంటీర్లు రాజీనామా

ఆత్రేయపురం, ఏప్రిల్6: నార్కెడిమిల్లిలో సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 18మంది వలంటీర్లు శనివారం రాజీనామా ప్రకటించారు. వారందరూ కలిసి ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు రాజీనామా పత్రాలను అందచేశారు.

బోటు ప్రమాదంలో యానాం మత్స్యకారులకు గాయాలు



యానాం, ఏప్రిల్ 6: విశాఖపట్నం సముద్రంలో చేపలవేటకు వెళ్లిన కాకినాడకు చెందిన బోట్ ఇంజన్ పేలిపోయి ఏడుగురు మత్స్యకారులు గాయపడిన విషయం విదితమే. వీరిలో యానానికి చెందిన ఇద్దరు మత్స్యకారులున్నారు. 14రోజుల కితం వేటక వెళ్లారని, అర గంట తర్వాత వెనక్కు తిరిగి రావాలని అనుకుంటున్న సమయంలో ఈదుర్ఘటన చోటుచేసుకుందని తెలిసింది. యానాం ఓల్డ్ రాజీవ్‌నగర్‌కు చెందిన సంగాని పెద సత్తిబాబు, దండుప్రోలు శ్రీనులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ప్రమాదం గురించి పుదుచ్చేరిలో ఉన్నతాధికారులకు, సీఎం రంగస్వామి దృష్టికి తీసుకువెళ్లినట్టు మల్లాడి కృష్ణారావు తెలిపారు. ప్రస్తుతం వీరు విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కాపులు అన్ని రంగాల్లో రాణించాలి

మండపేట, ఏప్రిల్ 6: కాపులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన కాపుల ఆత్మీయ సమ్మేళనానికి కాపు సంఘ నేత జిన్నూరి సాయిబాబా అధ్యక్షత వహించారు. పార్టీలకు అతీతంగా కాపు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. కపిలేశ్వరపురం జడ్పీటీసీ అబ్బు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, ఎంపీపీ ఉండమట్ల వాసు, కౌన్సిలర్లు దూలం వెంకన్నబాబు, యాళ్ల శ్రీను, శిరంగు శ్రీను, కొప్పిరెడ్డి కిట్టయ్య, జొన్నల వేంకటేశ్వరరావు, జొన్నపల్లి సూర్యారావు, కాపులు పాల్గొన్నారు.

వైసీపీకి మాజీ ఎంపీటీసీ రాజీనామా



కొత్తపేట, ఏప్రిల్ 6: పలివెల మాజీ ఎంపీటీసీ కడలి పెరుమాళ్లు వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీలో తనకు తగిన గుర్తింపులేదని, తాను శాసనసభ్యుడికి గ్రామాభివృద్ధి పనుల కోసం ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. ఇటు గ్రామాభివృద్ధి చేయకపోవడం అటు పార్టీలో సరైన గుర్తింపులేకపోవడంతో తాను వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు పెరుమాళ్లు తెలిపారు.

సీ-విజిల్ యాప్ ఫిర్యాదుతో వైసీపీ ఫ్లెక్సీ తొలగింపు

రావులపాలెం, ఏప్రిల్ 6: సీ విజిల్‌యాప్ ఫిర్యాదుతో వైసీపీ ఫ్లెక్సీని అధికారులు తొలగించారు. ముషిణి వెంకటనారాయణమ్మ ఆశా వర్కరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె ఇంటిపై వైసీపీ సిద్ధం ఫ్లెక్సీ ఏర్పాటుచేసి ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ ఫ్లెక్సీని తొలగించకపోవడంతో సీ విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయడంతో తొలగించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

ప్రజలకు కాంగ్రెస్‌తోనే మేలు

మలికిపురం, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రజలకు ఎంతో మేలు జరిగేలా ఉందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రరాజు గోపాలకృష్ణంరాజు శనివారం అన్నారు. విభజన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో మేలు జరుగుతుందన్నారు. జమిలీ ఎన్నికల నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తిరస్కరించిందన్నారు. రిజర్వేషన్ల పరిమితిని పెంచడానికి పార్టీ ఆలోచన చేస్తుందన్నారు.

నిరుపేద కాపులకు కాపునాడు సాయం

ముమ్మిడివరం, ఏప్రిల్ 6: నిరుపేద కాపులను కాపునాడు ఆదుకుంటుందని ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్ నంద్యాల చంటి అన్నారు. ముమ్మిడివరానికి చెందిన గుద్దటి కాశి కేన్సర్‌తో మృతిచెందగా అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లల చదువుల కోసం రూ.60వేలు అందజేశారు. శనివారం చవటపల్లి నాగు, చవటపల్లి శ్రీను, అబ్బిరెడ్డి సురేష్, కోటిపల్లి ధర్మరాజు, సుంకర బుజ్జి, దామిశెట్టి అంజి, నంద్యాల చంటిలు సాయాన్ని అందించారు. ఈపంపిణీలో కర్రా దుర్గాప్రసాద్ బృందం కాపునాడుకు సహకరించింది.